క్లుప్తంగా

అప్పన్న దర్శనాల పునరుద్ధరణ



దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు సోమవారం ఉదయం 8 గంటల నుంచి భక్తులకు కల్పించారు. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఉదయం 11.30 గంటల వరకు మాత్రమే కల్పించి ఆరోజు మధ్యాహ్నం 2.25 గంటలకు ఆలయ కవాటబంధనం చేసిన విషయం తెలిసిందే. తిరిగి సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ, సుప్రభాతసేవ, హోమాలు, స్నపన తిరుమంజనం, బాలభోగం సేవలు నిర్వహించారు.

సామూహిక రుద్రాభిషేకం



సామూహిక రుద్రాభిషేకంలో కాలనీవాసులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో జరుగుతున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పరమేశ్వరుడికి సామూహిక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేదికపై శివలింగాన్ని ఏర్పాటు చేశారు. విఘ్నేశ్వరపూజ, పలు రకాల పండ్ల రసాలు, పాలతో విశేష అభిషేకాలు జరిపారు. కాలనీవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. కాలనీ అసోసియేషన్, సింహపురి యూత్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మర్యాదపూర్వక కలయిక



పైల శ్రీనివాసరావును అభినందిస్తున్న బూడి ముత్యాలనాయుడు

పరవాడ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల పరిశీలకుడు పైల శ్రీనివాసరావు రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును తారువలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆయన శ్రీనివాసరావుకు శాలువా వేసి, అభినందించారు. అనకాపల్లిలో మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరుబాట కార్యక్రమంపై చర్చించారు. కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం నుంచి 500 మంది రైతులు పాల్గొంటారని చెప్పినట్లు శ్రీనివాసరావు తెలిపారు. బూడిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పైల అప్పలనాయుడు, బొద్దపు చిన్నారావు ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఆర్‌ఐ వీరయ్య తదితరులు

సబ్బవరం: మండలంలోని అమృతపురం గ్రామంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకొన్నారు. అమృతపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.379లో 35.64 ఎకరాల గయాళు ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించారు. ఆర్‌ఐ వీరయ్య సిబ్బందితో కలిసి ఆక్రమణలు తొలగించి, ప్రభుత్వ భూమిలో హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేశారు. స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, హెచ్చరికల బోర్డును తొలగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

కురసాల సత్యనారాయణకు ఘన నివాళి



కురసాల సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబును ఆ పార్టీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం పరామర్శించారు. కాకినాడలోని కన్నబాబు నివాసంలో ఆయన్ను కలిసి ఇటీవల మరణించిన కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన వెంట పార్టీ నేతలు శరగడం చినఅప్పలనాయుడు, బోకం రామునాయుడు, కొటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి పాల్గొన్నారు.

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిని ప్రజల తాగునీటి అవసరాలకు అందించే బాధ్యత మాత్రమే మాది. మిగిలిన ఏ అంశమూ మా పరిధిలోకి రాదు. అయినా కూడా అప్పడప్పుడూ మేహాద్రి కాలువల అభివృద్ధి, ఇతర సుందరీకరణ పనులు చేపడుతున్నాం. ఇక ప్రమాదాల నివారణ బాధ్యత సంబంధిత శాఖలు తీసుకోవాలి'

\- జీవీఎంసీ అధికారుల మాట

రిజర్వాయర్‌లోకి ప్రజలు దిగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. జలాశయంలోకి దిగొద్దంటూ.. హెచ్చరిక బోర్డులు పెడుతున్నాం. వారాంతాల్లో మా సిబ్బందిని గస్తీ కోసం ప్రత్యేకంగా నియమిస్తున్నాం. అయినా దురదృష్ట వశాత్తు ప్రమాదాలు జరుగుతున్నాయి. కళ్ల ముందే ప్రాణాలు పోతుంటే చాలా బాధగా ఉంటుంది.

\- పోలీస్ అధికారుల ఆవేదన

మా బాధ్యతగా రిజర్వాయర్‌లోకి ఎవరినీ దిగకుండా సిబ్బందిని ఉంచుతున్నాం. రేయింబవళ్లు మా వాళ్లు పర్యవేక్షిస్తున్నారు. అయితే మా సిబ్బంది కళ్లుగప్పి కొందరు నీటిలోకి దిగి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. జలాశయంలో మునిగిపోయి ప్రాణాలు పోతుంటే మాకూ చాలా ఆవేదనగా ఉంటుంది.


\- నీటి పారుదల శాఖ అధికారులు

మేహాద్రి జలాశయం.. మృత్యునిలయం

- రిజర్వాయర్‌లో నిత్యం ప్రమాదాలు
- పర్యవేక్షణను గాలికి వదిలేసిన ఉన్నతాధికారులు
- ఆకతాయితనం, అవగాహనా రాహిత్యంతో బలి
- పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం!



ప్రమాదాలకు నిలయంగా మారిన మేహాద్రి గెడ్డ రిజర్వాయర్



ప్రమాదకరమైన మేహాద్రి ఔట్ ఫ్లో ప్రాంతం (ఇక్కడ కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి)



మేహాద్రి జలాశయం నుంచి మృతదేహాన్ని బయటకు తెస్తున్న గజ ఈతగాళ్లు(ఫైల్)

పెందుర్తి:

జీవితంపై ఎన్నో ఆశలు.. కుటుంబ బాధ్యతలు.. స్నేహితులతో మధురానుభూతులు.. అన్నీ మేహాద్రిలో సమాధి అవుతున్నాయి. సరదాకో.. కాలక్షేపానికో రిజర్వాయర్‌కు వెళితే అక్కడే కొందరి జీవితాలు ముగిసిపోతున్నాయి. ఇటు కుటుంబ సభ్యులకు.. అటు స్నేహితులకు తీరని వేదనే మిగులుతోంది. మేహాద్రిలో తరచూ సంభవిస్తున్న ప్రమాదాల నివారణ బాధ్యత ఎవరిది? రిజర్వాయర్‌లోకి ప్రజలు దిగకుండా.. ప్రాణాలు కోల్పోకుండా పర్యవేక్షించాల్సింది ఎవరు? అనే ప్రశ్నకు సమాధానం మాత్రం దొరకట్లేదు.

తరచూ మింగేస్తోంది!

నగర పరిధిలో ఎక్కువ నీటి మట్టం(61 అడుగులు) కలిగిన రిజర్వాయర్ మేహాద్రిగెడ్డ. నగరంతో పాటు శివారు ప్రాంతాల ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. వారాంతాల్లో మందుబాబుల పార్టీలకు కొదవే లేదు. సరదాగా ఈత కొట్టేందుకు.. చేపలు పట్టుకుందామని.. ఇలా చాలా మంది వస్తారు. వీరెవరికీ దీని లోతు గురించి అవగాహన ఉండదు. గేటు వద్ద వాలు ఎక్కువగా ఉండడంతో దిగితే ప్రమాదం ఏమీ ఉండదన్న ధీమాతో నీటిలోకి దిగుతున్నారు. కొన్నిచోట్ల అధికంగా నాచు ఉండడంతో ఉన్నపాటుగా జారి నీటిలో మునిగిపోతున్నారు. కొందరు మద్యం మత్తులో నీటిలో దిగి, బురద ఊబుల్లో కూరుకుపోయి మరణిస్తున్నారు. గత పదేళ్లలో 80 మందికి పైగానే ఇలా మృత్యువాత పడ్డారు.

పర్యవేక్షణా లోపం

మేహాద్రి రిజర్వాయర్ పూర్తిగా నీటి పారుదలశాఖ ఆధీనంలోనే ఉంది. ఇందులో నీటిని నగర ప్రజల అవసరాలకు జీవీఎంసీ వాడుకుంటుంది. ఇక పౌరుల రక్షణ బాధ్యతలో భాగంగా పెందుర్తి పోలీసులు వారాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు కూడా పెట్టారు. సిబ్బంది కొరత కారణంగా 24/7 గస్తీ ఏర్పాటు సాధ్యం కావడం లేదన్నది ఆ శాఖ అధికారుల మాట. మరోవైపు మేహాద్రి గేటు ప్రాంతంలో నీటి పారుదలశాఖ సిబ్బంది ముగ్గురు ఉంటున్నారు. ఒకరు 24 గంటలు ఉండగా, మిగిలిన ఇద్దరు ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తారు. ఇక ఆ బాధ్యత జీవీఎంసీకి లేదు కాబట్టి ఆ విభాగానికి చెందిన సిబ్బంది ఒక్కరూ ఉండట్లేదు.

అధికారిక పర్యాటక కేంద్రమైతే..

మేహాద్రి రిజర్వాయర్‌లో ప్రమాదాల నివారణకు మరో మార్గం కూడా ఉందని నిపుణులు చెప్తున్నారు. తాటిపూడి రిజర్వాయర్ తరహాలో మేహాద్రిని కూడా పూర్తిస్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టుతుందంటున్నారు. పర్యాటక కేంద్రంగా అధికారిక ముద్ర పడితే అన్ని శాఖల సిబ్బంది ఇక్కడ అందుబాటులో ఉంటారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడడంతో పాటు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్న అభిప్రాయాలున్నాయి. ఆ దిశగా జిల్లా ఉన్నతాధికారులు ఆలోచన చేయాలని పలువురు కోరుతున్నారు.

శాశ్వత ఔట్ పోస్టుకు ప్రతిపాదన



మేహాద్రిలో ప్రమాదాలు చూస్తుంటే చాలా బాధగా ఉంది. మా వంతు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. కానీ అన్ని వైపుల నుంచీ సహకారం ఉండాలి. అలా లేకపోవడం వల్లే దురదృష్టవశాత్తు ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మేహాద్రిలో ప్రమాదాల నివారణకు మరో అడుగు ముందుకేసి ఇక్కడ శాశ్వత పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారులు అనుమతిస్తే తక్షణమే ఏర్పాటు చేస్తాం.

\- కేవీ సతీష్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి

అక్రమ నిర్మాణాలపైనే అధిక ఫిర్యాదులు



వినతులు తీసుకుంటున్న జీవీఎంసీ అధికారి



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకట అప్పారావు

- జోన్–8 పరిధి పీజీఆర్‌ఎస్‌కు 18 వినతులు

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 పరిధిలో ఇబ్బడిముబ్బడిగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లిప్తత కారణంగా జీవీఎంసీ ఆదాయానికి గండి పడుతున్న తీరును ఈ ఫిర్యాదులు నిరూపిస్తున్నాయి. వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి 18 అర్జీలు రాగా అందులో ఏకంగా 12 ఫిర్యాదులు అక్రమ నిర్మాణాలపైనే వచ్చాయి. దీంతో జోన్–8లోని టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్న గుసగుసలు వినిపించాయి. జీవీఎంసీ 95వ వార్డు మరిడిమాంబ కాలనీలో, దుర్గానగర్ ప్రాంతంలో, లక్ష్మీపురంలో, 97వ వార్డులోని చినముషిడివాడలో, 89వ వార్డు ఎల్లపువానిపాలెంలో అనుమతి లేని నిర్మాణాలు, 98వ వార్డు సింహాచలం ప్రాంతంలో రోడ్డు ఆక్రమణలపై ఫిర్యాదులు అందాయి. వాటితో పాటు మరో నాలుగు సాధారణ సమస్యలపై అర్జీలు రాగా అధికారులు వాటిని స్వీకరించారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

మ్యుటేషన్‌లు, ఎఫ్‌లైన్ దరఖాస్తులపై నిర్ణీత కాలంలో పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఆర్‌ఐ హరి ప్రసూన, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలకు చంద్రబాబు వెన్నుపోటు

- రైతులకు సరిపడా యూరియా కూడా ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం
- రైతులకు అన్యాయం జరుగుతుంటే డిప్యూటీ సీఎం ఎక్కడ?
- 'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ధ్వజం



అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు జయరామ్, శరగడం, గండి రవి తదితరులు

పెందుర్తి: 'ఎన్నికల సమయంలో వ్యవసాయ రంగాన్ని ఉద్ధరిస్తామని మాయ మాటలు చెప్పి రైతుల ఓట్లు వేయించుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది అన్నదాత సుఖీభవ ఇవ్వకుండా మోసం చేశారు. రెండో ఏడాది అరకొరగా వేసినా అర్హులందరికీ ఇవ్వలేదు. ఇప్పుడు ఖరీఫ్‌కు సరిపడా యూరియాను అందించలేని చేతకాని కూటమి ప్రభుత్వమిది. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అయిన సీఎం చంద్రబాబు అనుకున్నట్లుగానే మరోసారి రైతులను దారుణంగా వంచించార'ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మండిపడ్డారు. సోమవారం రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అనకాపల్లిలో నిర్వహించనున్న అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకు ఎరువులు వేసే సమయంలో రైతాంగానికి సరిపడా యూరియాను ప్రభుత్వం అందించలేకపోవడం సిగ్గుచేటన్నారు. యూరియా దొరక్క రైతులు అల్లాడిపోతుంటే.. ప్రశ్నిస్తా అని ప్రగల్భాలు పలికిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని రైతుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే గానీ, ఇతర కూటమి నాయకులు గానీ ఒక్క రోజైనా పట్టించుకున్నారా అని నిలదీశారు. పవన్‌కల్యాణ్ సినిమా ప్రచారానికి నియోజకవర్గంలోని యంత్రాంగాన్ని వాడుకుని ర్యాలీలు చేసిన ఎమ్మెల్యే పంచకర్లకు రైతుల సమస్యలు పట్టకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఒక్క రోజు కూడా ఇలాంటి సమస్య లేదన్నారు. రైతులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనకాపల్లిలోని ఆర్డీవో కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం జరగనున్న అన్నదాత పోరు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు బయిలపూడి భగవాన్ జయరామ్, శరగడం చిన అప్పలనాయుడు, గండి రవికుమార్, బోకం రామునాయుడు, మధుపాడ అంజి, కొటాన రాము, వడ్డాది అప్పలరాజు, గొరపల్లి శ్రీను, సబ్బవరపు నారాయణమూర్తి, బొడ్డు సూర్యప్రకాష్, కొరుబిల్లి శ్రీను, బోని నాయుడు, బొడ్డపల్లి హేమంత్‌కుమార్, రాపర్తి మాధవరావు, మెంటి మహేష్, దాసరి సత్తిబాబు, తామర్ల నర్సింగ్, పీతల అప్పలరాజు, బీఎస్ రాజు, యతిరాజుల నాగేశ్వరరావు, బల్ల రాంబాబు, కోరాడ చందుయాదవ్, ఎన్‌పీ రాజు, నాగభూషణం, బుజ్జి, వాసు, ఐడీ బాబు, యడ్ల నాయుడు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న వేద పాఠశాలలోకి వర్షం నీరు



వేదపాఠశాల గోడలపై నుంచి కారుతున్న వర్షం నీరు



వేదపాఠశాల పైకప్పు దుస్థితి

సింహాచలం: వర్షం కురిస్తే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేద పాఠశాల కారిపోతోంది. దీంతో వేద విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఏ కాస్త వర్షం పడినా పాఠశాల భవనం పైకప్పు నుంచి వర్షం నీరు పాఠశాల్లోకి చేరుతోంది. గోడలు తడిసి ముద్దవుతున్నాయి. పైకప్పు కూడా అంతంత మాత్రంగానే ఉంది. సోమవారం నాటి భారీ వర్షానికి ఈ పరిస్థితి మరీ దిగజారింది. దేవస్థానం అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో 43 మంది విద్యార్థులు వేద విద్య అభ్యసిస్తున్నారు. వీరంతా ఉదయం నుంచి రాత్రి వరకు పాఠశాల భవనంలోనే ఉంటారు. రాత్రి దేవస్థానానికి చెందిన నృసింహ సదన్‌లోని గదుల్లో నిద్రిస్తుంటారు. వేద పాఠశాల భవనానికి ఆది నుంచీ మరమ్మతులే. ఈ నేపథ్యంలోనే రాత్రి వేళల్లో విద్యార్థుల బసని నృసింహ సదన్‌కి మార్చారు. అప్పటి నుంచి విద్యార్థులకు ఉదయం వేళల్లో పాఠశాలలో విద్యాభ్యాసం, రాత్రి బసకు నృసింహ సదన్ శరణ్యమైంది. ఎన్నో ఏళ్లుగా వేద పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలని కోరుతున్నా.. దేవస్థానం అధికారులు తాత్సారం చేస్తూ వస్తున్నారన్న ఆక్షేపణలు వినిపిస్తున్నాయి.

ఆలయాల్లో సంప్రోక్షణ.. ప్రత్యేక పూజలు



విశ్వేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: చంద్రగ్రహణం సందర్భంగా సంప్రోక్షణ అనంతరం పెందుర్తి ప్రాంతంలోని పలు దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పినగాడిలోని చోడేశ్వరస్వామి ఆలయంలో శివునికి అభిషేకాలు జరిపారు. అనంతరం పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సుజాతనగర్ రత్నగిరినగర్‌లోని విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రత్యేక పూజలు జరిపారు. వ్యాపారవేత్త మొగ్గా ఈశ్వరరావు, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. వేంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ అనంతరం ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు దర్శనం కల్పించారు.

సింహగిరిపై కుండపోత వాన



ఉదయం కాస్త ఎండ.. ఆ తర్వాత మబ్బులతో దోబూచులాట. మధ్యాహ్నానికి ఒక్కసారిగా మారిన వాతావరణం. కరిమబ్బులు కమ్మిన ఆకాశానికి చిల్లుపడిందా.. అన్నంతగా కుండపోత వర్షం. ఇదీ.. సింహగిరిపై సోమవారం నాటి పరిస్థితి. దాదాపు గంటకు పైగానే భారీ వర్షం కురిసింది. దీంతో భక్తులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. దర్శనానంతరం బస్టాండ్‌కు వర్షంలో తడుస్తూనే వెళ్లారు.

\- సింహాచలం

'సాయి హెల్పింగ్ హ్యాండ్స్'కు ప్రశంస

- నేత్రదానం చేసిన కుటుంబాలకు సత్కారం



డీఎంహెచ్‌వో జగదీష్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న దాడి శ్రీనివాస్

పెందుర్తి: ఇటీవల మరణించిన వారి నేత్రాలను దానం చేసే ప్రక్రియలో చురుగ్గా వ్యవహరిస్తున్న స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టుకు ప్రశంసలు అందాయి. నగరంలోని ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సోమవారం నిర్వహించిన 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమంలో ట్రస్ట్ చేస్తున్న సేవలకు గాను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీష్, ఆర్‌ఈహెచ్ డాక్టర్ మీనాక్షి చేతుల మీదుగా ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ మధ్య కాలంలో మరణించిన వారి నేత్రాలను ట్రస్ట్ ఆధ్వర్యంలో దానం చేసేందుకు అంగీకరించిన కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.

భర్త మద్యం మానలేదని గృహిణి ఆత్మహత్య





హరిత మృతదేహం, భర్త శ్రీనుతో హరిత(పెళ్లి ఫొటో)

పెందుర్తి: దేవుడి మీద ప్రమాణం చేసిన తరువాత కూడా తన భర్త మద్యం తాగడం మానలేదని మనస్థాపం చెందిన ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి ప్రహ్లాదపురం శ్రీనివాసనగర్ సమీపంలోని బీహెచ్‌పీవీ కాలనీలో సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో నివాసం ఉంటున్న తోట నళిని కుమార్తె హరిత(27)కు కాకినాడకు చెందిన బిరదా శ్రీనుతో మూడేళ్ల క్రితం పెద్దలు వివాహం జరిపించారు. ఆటో నడిపే శ్రీను తన భార్యను తీసుకుని కొన్నాళ్ల క్రితం నగరానికి వచ్చి, అత్తవారింటికి సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శ్రీనుకు మద్యం అలవాటు ఉండడంతో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం సింహాచలం దేవస్థానానికి భార్య హరితను తీసుకెళ్లి, తాను మద్యం మానేస్తున్నట్లు దేవుడిపై ఒట్టు వేసి కడియం ధరించాడు. అయితే మాట మీద నిలబడకుండా ఆదీ, సోమవారాల్లో శ్రీను మద్యం సేవించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన హరిత సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందింది. కాసేపటికి ఇంటికి వచ్చిన శ్రీను తలుపులు కొట్టినా హరిత తీయకపోవడంతో బావమరిది తోట సాయికుమార్‌కు సమాచారం ఇచ్చాడు. ఇద్దరూ కలిసి తలుపును బలవంతంగా తెరిచి చూడగా.. హరిత అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లి తోట నళిని ఫిర్యాదు మేరకు సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.